క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) / దెందులూరు : ఏలూరు మండలం చాటపర్రు సెక్షన్ గుడివాక లంక సబ్ స్టేషన్ పరిధిలో 33 కేవీ కొత్త లైన్ పనుల నిమిత్త బుధవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. పైడిచింతపాడు, కొక్కిరాయిలంక గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉద్యోగికి పీఎఫ్ చెక్కు అందజేత



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ నూర్జహాన్

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదవి విరమణ చేసిన ఎండీ ఉఫ్రాన్‌కు ప్రావిడెంట్ ఫండ్ మొత్తం రూ.2.14 లక్షల చెక్కును మేయర్ షేక్ నూర్జహాన్ మంగళవారం అందజేశారు. నగరపాలక సంస్థలో ఎన్నో సేవలు అందించిన ఉఫ్రాన్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని, పదవీ విరమణ చెందిన వెంటనే అతనికి మున్సిపల్ కార్యాలయం నుంచి రావాల్సిన పూర్తి మొత్తాన్ని అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎ.భాను ప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభకు ఏలూరు కార్మికులు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేస్తున్న ప్రధాని మోదీ సభ వద్ద పారిశుధ్య పనులు నిర్వహణకు ఏలూరు నగర పాలక సంస్థ నుంచి 150 మందికి పైగా సిబ్బంది మంగళవారం బయలుదేరి వెళ్తున్నారని ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి అమరావతి బయలుదేరి వెళుతున్న కార్మికులను మేయర్ నూర్జహాన్ కలిసి వారికి కేటాయించిన ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

గిరిజన బంద్‌కు మద్దతు

ఏలూరు (టూటౌన్): గిరిజన ప్రత్యేక డీఎస్సీకి ఆర్డినెన్స్ తీసుకురావాలని, ప్రభుత్వం జీఓ-3ను పునరుద్ధరించాలని, గిరిజన ప్రాంత ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని కోరుతూ మే 2న గిరిజనులు చేపట్టనున్న బంద్‌కు సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి నేడు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. గిరిజన ప్రాంత నిరుద్యోగులకు కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహణకు ఆర్డినెన్స్ తీసుకు రావాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటించినప్పుడు జీఓ-3ను పునరుద్ధరిస్తామని సీఎం చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

బుట్టాయగూడెం: ఇటీవల విడుదలయిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ అన్నారు. బుట్టాయగూడెం మండలం తెల్లంవారిగూడెం, దొరమామిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 10వ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతులను పీఓ మంగళవారం పరిశీలించారు. ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 246 మంది 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయ్యారని పీఓ తెలిపారు. వీరు మళ్లీ తిరిగి పరీక్షలు రాసే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 143 మంది బాలికలు, దొరమామిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 103 మంది బాలురు ఈ శిక్షణ తరగతుల్లో చదువుకుంటున్నారని వివరించారు. ఇన్‌చార్జి డీడీ ఎం శ్రీవిద్య, ఏఎంఓ కె. శిరమయ్య, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేట్ మాయాజాలం

- ప్రారంభమైన విద్యా వ్యాపారం
- విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజు రాయితీ ఎర
- ఫోన్‌లకు మెసేజ్‌లు



పరీక్షలు రాయడానికి వెళుతున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ ఏడాది (2025–26 విద్యా సంవత్సరానికి) విద్యా వ్యాపారం ప్రారంభమైంది. పది, ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడడంతో కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల వివరాలను సేకరించి, వారి తల్లిదండ్రులను ప్రలోభపెట్టేదిశగా అడుగులు వేస్తున్నాయి. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను తమ కళాశాలల్లో చేర్చుకోవడం ద్వారా వచ్చే ఏడాది మంచి ఫలితాలు సాధించి వాటి ఆసరాతో మరింత మందిని ఆకర్షించేందుకు కృషి చేస్తున్నాయి. కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఇప్పటికే తరగతులు ప్రారంభించాయి. తల్లిదండ్రులు తమ పిల్లలు తరగతులు కోల్పోకూడదనే ఉద్దేశంతో వారిని ఆయా కళాశాలల్లో చేర్పేస్తున్నారు.

ప్రలోభాల ఎర

కార్పొరేట్ విద్యా సంస్థలు వివిధ మాధ్యమాల ద్వారా ప్రకటనలు గుప్పించి విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించే పనిలో పడ్డాయి. 10వ తరగతిలో తమ విద్యార్థులు రాష్ట్ర, జిల్లా, నగర, మండల స్థాయిల్లో ప్రథమ స్థానాల్లో నిలిచారని, ఇలాంటి ఫలితాలు ఆశిస్తే తమ కళాశాలలోనే పిల్లను చేర్పాలని ప్రలోభపెడుతున్నాయి. కార్పొరేట్ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు పలు ఇంజినీరింగ్ కళాశాలలు సైతం విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆకర్షించేందుకు కుస్తీ పడుతున్నాయి. కొన్ని కార్పొరేట్ సంస్థలు 10వ తరగతి ఉపాధ్యాయులకు కమీషన్లు ఆశ చూపి వారి వద్ద చదివిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తమ కళాశాలలకు రప్పించే ఏర్పాటు చేసుకుంటున్నాయి.

ఫీజు రాయితీ

ఆయా కార్పొరేట్ విద్యా సంస్థల ప్రతినిధులు 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతి నిత్యం మంతనాలు సాగిస్తున్నారు. ఫీజుల్లో 20 నుంచి 50 శాతం వరకు రాయితీలు ఇస్తామని ఎర వేస్తున్నారు. ఇంటర్‌లో నీట్, జేఈఈ మెయిన్స్ తదితర పరీక్షలకు లాంగ్ టర్మ్ శిక్షణ ఇస్తామని, తక్కువ మార్కులు పొందిన విద్యార్థుల నుంచి మంచి ఫలితాలు రాబట్టేలా కృషి చేస్తామని హామీ ఇస్తున్నారు. కొన్ని విద్యా సంస్థలు నీట్, జేఈఈలో సీటు సాధించకపోతే ఫీజులు తిరిగి ఇచ్చేస్తామని చెబుతున్నారు. హాస్టల్‌లో వసతి, భోజన సౌకర్యాలను పరిశీలించేందుకు తల్లిదండ్రులను తమ క్యాంపస్‌లకు ఆహ్వానించి వారిని సంతృప్తి పరచడానికి నానా తిప్పలు పడుతున్నాయి. పరీక్షల్లో అనుత్తీర్ణులైన వారిని కూడా చేర్చుకుని తల్లిదండ్రుల నుంచి ఫీజులు రాబడుతూ సప్లిమెంటరీలో కూడా ఉత్తీర్ణులు కాకపోతే ఫీజులు వాపసు ఇస్తామని ఆఫర్లు ఇస్తున్నాయి. సప్లిమెంటరీ ఫలితాలు వచ్చాక చేర్పుదామనుకుంటే తమ విద్యా సంస్థల్లో సీట్లు లభించే అవకాశం ఉండకపోవచ్చని తల్లిదండ్రులను తొందరపెట్టి వారి పిల్లలను చేర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఏలూరు నగరంలో ఇలా

పదో తరగతి వరకు విద్యార్థులకు ఏసీ తరగతి గదులతో పాటు రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, మధ్యలో స్నాక్స్ వంటి సౌకర్యాలతో కొన్ని విద్యా సంస్థలు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్మీడియట్‌కు సంబంధించి పలు విద్యా సంస్థలు రెండుకు మించి క్యాంపస్‌లు, బాలికలకు వేరుగా, బాలురకు వేరుగా, బాలబాలికలకు కలిపి కో ఎడ్యుకేషన్ వేరుగా ఇలా ఆయా క్యాంపస్‌లను నిర్వహిస్తున్నాయి. వీటితో పలు సంస్థలు డిగ్రీ కోర్సులతో స్వాగతం పలుకుతున్నాయి. ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులో ఉన్నాయి.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



విద్యను వ్యాపారంగా మార్చుతూ విద్యా సంస్థలు చేస్తున్న ప్రలోభాల పర్వానికి ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి. నిబంధనలకు విరుద్ధంగా అప్పుడే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించిన తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో అనుత్తీర్ణులైన విద్యార్థులను కూడా చేర్చుకోవడానికి విద్యా సంస్థలు వెనుకాడకపోవడం తల్లిదండ్రులను మోసం చేయడమే.

– కాకి నాని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

ఫోన్‌లకు మెసేజ్‌ల వరద

ఇంజినీరింగ్ విద్యకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రాష్ట్రాల్లోని ఇంజినీరింగ్ కళాశాలల నుంచి మెసేజ్‌లు వరదలా వస్తున్నాయి. తమ కళాశాలలో పిల్లను చేర్పండి అంటూ ఆయా కళాశాలల్లో లభ్యమయ్యే కోర్సులను వివరిస్తూ మెసేజ్‌లు చేస్తున్నారు. కొన్ని సంస్థలు తాము ఆయా ఇంజినీరింగ్ కళాశాలలకు, తల్లిదండ్రుకలు మధ్యవర్తిత్వం వహిస్తున్నామని, తమ ద్వారా విద్యార్థులను చేర్పితే ఫీజుల్లోనూ, హాస్టళ్లలోనూ రాయితీలు ఇప్పించే ఏర్పాటు చేస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు తల్లిదండ్రులతో ఫోన్‌లో చెబుతూ ఆకట్టుకునే పనిలో ఉన్నాయి. ఆయా సంస్థల ప్రచారాలు, మధ్యవర్తుల రాయబారాలు, విద్యా సంస్థల మెసేజ్‌లతో తల్లిదండ్రులు డైలమాలో పడుతున్నారు.

ఆర్‌సీఈ ఆవిష్కరణకు అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆర్‌సీఈ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల ఫ్యాకల్టీ, విద్యార్థి రూపొందించిన నూతన ఆవిష్కరణకు అవార్డు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం మురళీధర రావు ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతిలోని వీఐటీ ఏపీలో ఈ నెల 28న నిర్వహించిన వీ లాంచ్ ప్యాడ్-25 కార్యక్రమంలో తమ కళాశాల ఫ్యాకల్టీ భవన్నారాయణ కొట్టే, విద్యార్థి జి.ఉమా నవీన్ కుమార్ అభివృద్ధి చేసిన రైతులకు ఉపయోగపడే అడ్వాన్స్‌డ్ సోనిక్ అగ్రికల్చర్ వాటర్ పంప్ టెక్నాలజీకి అవార్డు లభించిందని వివరించారు. మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతులు మీదుగా అవార్డు అందుకున్నట్టు పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలకు కళాశాల చైర్మన్ కె.వేణుగోపాల్, కళాశాల సెక్రటరీ కె.సాయి రోహిత్ అభినందనలు తెలిపారు.

మేడేను విజయవంతం చేద్దాం

దెందులూరు: కార్మిక దినోత్సవం మే డేను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల శ్రీను పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీపర్రులోని నిర్మాణ కార్మికుల సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

బాల్య వివాహ వ్యవస్థ నిరోధంపై ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న క్రాప్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కొత్త రోడ్డులో ఉన్న నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ (క్రాప్) ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ ఆర్ వినోద్ అధ్యక్షతన బాల్య వివాహ వ్యవస్థ నిరోధంపై ప్రతిజ్ఞ కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా నవసమాజ్ సొసైటీ చైర్మన్ నేతల రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో క్రాప్ సీఎస్‌డబ్ల్యూ జి.రాజ్యలక్ష్మి, మేడిశెట్టి గిరిబాబు, కొత్తల పూర్ణ మల్లికార్జున్, దాసి వెంకటేశ్వర్లు, బయ్యారపు వెంకటరమణ, అడారి సత్యనారాయణ, బుస్సా తిరుమలరావు, పీశెట్టి నర్సింహ పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): వేసవిలో వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ముద్రించిన వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తల పోస్టర్‌ను కలెక్టర్ వెట్రిసెల్వి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తలనొప్పి, అలసట, ఒళ్లునొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. సూర్య కిరణాలు శరీరంపై పడకుండా చూచుకోవాలని, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలని సూచించారు. ఎండల్లో బయట తిరగొద్దని, ఉదయం, సాయంత్రం మాత్రమే అత్యవసర పనులు చేసుకోవాలని అన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు ఇంటికే పరిమితం కావాలన్నారు. వడదెబ్బ తగిలిన వారిని నీడపట్టున చేర్చి దుస్తులను వదులుగా చేసి తడిగుడ్డతో ఒళ్లంతా తుడవాలని సూచించారు. గాలి, వెలుతురు బాగా తగిలేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ కో ఆర్డినేటర్ రాజీవ్, డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ, ఐసీడీఎస్ పీడీ పి.శారద, డీసీపీఓ సూర్య చక్రవేణి, పలువురు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



బస్టాండులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు ఆర్టీసీ బస్టాండులో మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మానవత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కర్ రావు మాట్లాడుతూ వేసవిలో దాహార్తిని తీర్చడం ఎంతో పుణ్యమైన కార్యక్రమమన్నారు. ప్రయాణికుల అవసరాలకి తగినట్టుగా మంచి నీటిని అందజేస్తామని తెలిపారు. ఏలూరు మండలాధ్యక్షురాలు కోడూరు కనకదుర్గ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టమని, ఇటువంటి అవకాశం కలిగించిన ఆర్టీసీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులకు దాహార్తిని తీర్చడానికి ముందుకు వచ్చిన మానవత వారి పెద్దమనస్సుకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మానవత విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మేతర అజయ్ బాబు, బస్ స్టేషన్ మేనేజర్ కేవీఎన్ కుమారి, పీఆర్‌ఓ కేఎల్‌వీ నరసింహం పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కోరుతూ నిరసన



కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ / కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ గత 15 నుంచి చేస్తున్న నిరసనలకు సమాధానం రాకపోవడంతో ఈనెల 28 నుంచి సమ్మెలో పాల్గొంటున్నట్టు చెప్పారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని కోరారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలన్నారు. ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను చెల్లించి క్రమబద్ధీకరించాలని, నిర్దిష్టమైన జాబ్ చాటర్ అందించాలని కోరారు. ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్ఓలను మినహాయింపు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం, నూజివీడు డివిజన్‌లకు చెందిన సీహెచ్ఓలు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మ్యారేజ్ స్కీమును వినియోగించుకోవాలి

దెందులూరు: డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ మ్యారేజ్ స్కీమును కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని అంబేడ్కర్ సంఘం జాతీయ నాయకులు మానవ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్లి మురళి, ఎంఆర్‌పీఎస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మురళి అన్నారు. మంగళవారం చాటపర్రు కమ్యూనిటీ హాల్‌లో నాయకులు మాట్లాడుతూ కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు కేంద్రం డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ మ్యారేజ్ స్కీమును ప్రారంభించడం స్వాగతించదగ్గ విషయమన్నారు. కులాంతర వివాహం చేసుకున్న జంటలకు రూ.2.5 లక్షల ఆర్థిక సాయం రెండు వాయిదాల్లో అందిస్తారని తెలిపారు. దంపతుల్లో ఒకరు ఎస్సీ, మరొకరు ఇతర కులానికి చెందిన వారై ఉండాలని అన్నారు. వార్షికాదాయం రూ.5 లక్షలకు మించి ఉండకూడదని తెలిపారు.

రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా ప్రసాద్



సమావేశంలో పాల్గొన్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

ఏలూరు (టూటౌన్): రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ చైర్మన్‌గా డాక్టర్ ఎస్‌వీఎస్‌వీ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా భవనంలో డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు అధ్యక్షతన, రెడ్ క్రాస్ ఏపీ స్టేట్ బ్రాంచ్ అబ్జర్వర్ పి.రామచంద్ర రాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రెడ్ క్రాస్ నూతన కమిటీ సభ్యులుగా 11 మందిని ఎన్నికయ్యారు. చైర్మన్‌గా డాక్టర్ ఎంబీఎస్వీ ప్రసాద్, వైస్ చైర్మన్‌గా జె.సత్యనారాయణ రాజు, ట్రెజరర్‌గా ఎన్ బ్రహ్మానందం, కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, మునగాల మురళీకృష్ణ, కొత్త గుండు శ్రీనివాస్, మేతర అజయ్ బాబు, పెన్మత్స శ్రీరామ రాజు, మోతే పల్లి చంద్రశేఖర్, బొల్లా లక్ష్మీ నారాయణ, ఎంవీవీఎస్ నాగేశ్వరరావు, ఆడిటర్‌గా గురజాడ శ్రీకాంత్ ఎన్నికయ్యారు. జిల్లా రెవెన్యూ ఆఫీసర్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన షెడ్డు, రెడ్ క్రాస్ తాగునీటి కుళాయిని ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఏపీ రాష్ట్ర శాఖ అబ్జర్వర్ పి రామచంద్ర రాజు, రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఏఓ ఎన్‌వీ నాంచారయ్య, డాక్టర్ ఆర్ఎస్ఆర్కే వర ప్రసాదరావు, గురజాడ శ్రీకాంత్, రెడ్ క్రాస్ సభ్యులు కడియాల కృష్ణారావు, కూచిపూడి సత్యనారాయణ, రేపూరి శివప్రసాద్, అడుసుమిల్లి నిర్మల, బీఆర్ సీహెచ్ నారాయణ తదితరులు హాజరయ్యారు.

9న బీడీఎస్ కార్యవర్గ సమావేశాలు



బీజీఎస్ సమావేశాల కరపత్రం విడుదల చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: భారత దళిత సేన (బీడీఎస్) జాతీయ కార్యవర్గ సమావేశాలు మే నెల 9న విజయవాడ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్టు బీడీఎస్ జాతీయ అధ్యక్షుడు ఈవీ స్వామి, జాతీయ కార్యదర్శి అలుగు ఆనందశేఖర్ తెలిపారు. మంగళవారం ఉదయం జంగారెడ్డిగూడెం ప్రియదర్శిని కళాశాలలో భారత దళిత సేన జాతీయ కార్యవర్గ సమావేశాల కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ సమావేశాలకు ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ హాజరవుతారని తెలిపారు. దేశంలో దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. బీడీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది జాన్ ప్రసంగి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నరెళ్ల విజయ ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఐఆర్ఎస్ అధికారి మహేష్ రాజు, ఆంధ్రప్రదేశ్ గౌరవ అధ్యక్షుడు బిషప్ రత్నకుమార్ తదితరులు అధ్యక్షవర్గంగా వ్యవహరిస్తారని, జాతీయ కార్యవర్గ సమావేశాలకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడిని ఖండించారు. కార్యక్రమంలో బీడీఎస్ యువజనుల విభాగం ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షులు గూడపాటి వెంకటేశ్వరరావు, కాటం ప్రసాద్, బాతుల వేణు, పాడేటి సత్యనారాయణ, ఎం రమ్య, జోడాల గిరిబాబు, బోడా వెంకటేశ్వరరావు, గంజి మరియమ్మ, రాజు, రవి, జ్యోతి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు ఉద్యమం

ఏలూరు (టూటౌన్): కార్మిక హక్కులు హరించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేంత వరకు ఉద్యమిద్దామని ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు అన్నారు. ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ అనుబంధ సంఘాలతో జనరల్ బాడీ సమావేశం యూనియన్ సెక్రెటరీ యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ దేశంలో మోదీ షా సర్కార్ కార్మిక వర్గంపై పెను దాడులు చేస్తూ ఉన్న చట్టాలను హరిస్తూ ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడులకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్య ఉద్యమాలను నిర్మించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. హమాలీలకు ఉపాధి భద్రత తోకుడిన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మే ఒకటో తేదీ సాయంత్రం 5 గంటలకు స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని పాండురంగ థియేటర్ ఎదురుగా నిర్వహించే బారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మీసాల రమణ, ధనను విజయ్, ఘడసాల రమణ, పల్లి గంగరాజు, కోరాడ మంగరాజు రాము, అప్పారావు, పాతాళ అప్పారావు, దుర్గారావు, సింహాచలం, పద్మ, సుశీల, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	17
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో (సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమం) భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం నుంచి కార్యక్రమాలను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు. కార్యక్రమాలను సీనియర్ రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులతో యోగాతో కూడిన సరదా ఆటల పోటీలు, కథలు చదివించడం, కథలు చెప్పించటంపై శిక్షణ ఇచ్చారు. పి.శంకర్ డ్రాయింగ్‌లో మెళకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అందజేత



విర్డ్ ఆస్పత్రిలో కృత్రిమ అవయవాన్ని అందజేస్తున్న పాండురంగారావు

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో దివ్యాంగులకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డీఎస్పీ జి.పాండురంగారావు మంగళవారం కృత్రిమ అవయవాలను అందజేశారు. ఆస్పత్రి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1,00,000 విరాళం అందించారు. తొలుత ఆయన విర్డ్ ఆస్పత్రిని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో తయారైన ప్రోస్తాసిస్ 3డి ప్రింట్ కృత్రిమ అవయవాలు, కాలిపర్స్‌ను 10 మంది దివ్యాంగులకు అందించారు. కాలిపర్స్ తయారీకి సహకరిస్తున్న గుప్తా ఫౌండేషన్ చైర్మన్ ఎంఎం గుప్తాను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణ మూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి, ఎక్సైజ్ శాఖ ఎస్సై రామస్వామి తదితరులున్నారు.